ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

అనంతపురం

జిల్లా వార్తలు

శుక్రవారం 20 సెప్టెంబరు 2024



ఎంఈఓ చంద్రశేఖర్ సస్పెన్షన్

అనంతపురం విద్య, సెప్టెంబరు 19: కూడేరు మండల విద్యాశాఖాధికారి చంద్రశేఖర్‌ను కడప ఆర్‌జేడీ శామ్యూల్ సస్పెండ్ చేశారు. ఓ ప్రైవేట్ పాఠశాల సిబ్బంది నుంచి రూ.2లక్షల లంచం తీసుకుంటూ ఈ నెల 17న ఆయన ఏసీబీ ట్రాప్‌లో పడిన విషయం తెలిసిందే. జిల్లా విద్యాశాఖలో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. ఏసీబీ ట్రాప్ వ్యవహారం, పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా.... జిల్లా విద్యాశాఖాధికారి విచారణ అనంతరం పాఠశాల విద్యాశాఖ కడప ఆర్‌జేడీ శామ్యూల్ ఎంఈఓ చంద్రశేఖర్‌పై చర్యలకు దిగారు. కూడేరు ఎంఈఓ చంద్రశేఖర్‌నును సస్పెండ్ చేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసినట్లు విద్యాశాఖ వర్గాలు గురువారం తెలిపాయి.

అక్రమ కేసులపై విచారణ



ఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక బృందం

వైసీపీ హయాంలో జేసీ కుటుంబానికి వేధింపులు



అనంతపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై నమోదైన అక్రమ కేసుల నిగ్గు తేల్చేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధమైంది. రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాలతో ఎస్పీ జగదీష్ నేతృత్వంలో ముగ్గురు పోలీసు ఉన్నతాధికారుల బృందంతో విచారణ చేయిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. బీఎస్-3 వాహనాలను బీఎస్-4గా చూపించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో అప్పటి ఆర్టీఓ అనంతపురం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రభుత్వ పెద్దలు, నాటి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఒత్తిడి కారణంగా పోలీసులు జేసీ ప్రభాకర్‌రెడ్డిని, ఆయన తనయుడు అస్మిత్ రెడ్డిని హైదరాబాదుకు వెళ్లి తెల్లవారుజామున అరెస్టు చేశారు. అనంతపురం కోర్టులో హాజరుపరిచి, న్యాయాధికారి ఆదేశాలతో కడప సెంట్రల్ జైలుకు తరలించారు. జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన కుమారుడు 53 రోజుల పాటు జైలులో గడిపి, బెయిల్‌పై బయటకు వచ్చారు. కడప జైలు నుంచి అనుచరులతో కలిసి ర్యాలీగా వస్తుండగా.. తాడిపత్రి సమీపంలో సీఐపట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ తిరిగి జేసీ ప్రభాకర్‌రెడ్డిని జైలుకు పంపించారు. బీఎస్-3 వాహనాలను బీఎస్-4గా రిజిస్ట్రేషన్ చేయించారన్న ఆరోపణలపై జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన తనయుడిపై కేసులు నమోదు చేసిన ఆర్టీఏ అధికారులు... వాటిని విక్రయించిన సంస్థలపైగాని, రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపైగాని ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదే అంశంపై జేసీ ప్రభాకర్ రెడ్డి పలుమార్లు ప్రశ్నించారు. అధికారులను అడ్డుపెట్టుకొని వైసీపీ నాయకులు జేసీ ప్రభాకర్ రెడ్డిని అక్రమ కేసులతో వేధించారని అప్పట్లో జోరుగా ప్రచారం సాగింది. ఆయనను ఆర్థికంగానూ దెబ్బకొట్టాలని ప్రయత్నించారు. ప్రభుత్వం మారిన తరువాత తనపై అక్రమంగా నమోదైన కేసులను నిగ్గు తేల్చాలని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు జేసీ ప్రభాకర్ రెడ్డి విన్నవించారు. ఎస్పీ, వన్‌టౌన్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అక్రమ కేసులు పెట్టిన ఆర్టీఏ, పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో పోలీసుశాఖలోని కొందరు ఉన్నతాధికారులతో ఎస్పీ జగదీష్ విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారని తెలిసింది. రెండుమూడు రోజుల్లో విచారణాధికారులు ఎస్పీకి నివేదికను అందజేస్తారని సమాచారం. ఆ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపి, బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

నో స్టాంప్..!

కృత్రిమ కొరత సృష్టిస్తున్న ప్రైవేటు సంస్థలు..?

స్టాంపు డ్యూటీ చెల్లిస్తేనే ఏజెన్సీలకు సరఫరా..!

స్టాక్ హోల్డింగ్, సీఎస్‌సీ చేతిలో వ్యవహారం

వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ప్రజలకు కష్టాలు

నాన్ జ్యుడీషియల్ స్టాంపులదీ అదే పరిస్థితి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 19: స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖలో ప్రైవేటు పెత్తనం కొనసాగుతోంది. వారు జారీ చేస్తేనే స్టాంపులు వేసుకునే దుస్థితి నెలకొంది. రెండు వారాలుగా జిల్లాలో ఈ-స్టాంపుల కొరత ఏర్పడింది. దీంతో క్రయ విక్రయదారులు ఇక్కట్లు పడుతున్నారు. అదనపు ధరలకు విక్రయించినా ఇన్నాళ్లు కొనుగోలు చేశారు. ఇప్పుడేమో నో స్టాక్ అంటున్నారు. 2022లో వైసీపీ ప్రభుత్వం ఈ-స్టాంపింగ్ విధానాన్ని తెచ్చింది. వాటి బాధ్యతను ప్రైవేట్ సంస్థలకు అప్పగించింది. కామన్ సెంటర్ సర్వీస్(సీఎస్‌ఈ), స్టాక్ హోల్డింగ్ కంపెనీలే ఈ-స్టాంపులు

దోపిడీ వ్యూహమా..?

ఈ-స్టాంపుల విషయంలో రెండు ప్రైవేట్ సంస్థలు కుంభకోణానికి తెరలేపాయా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. కృత్రిమ కొరత సృష్టించి, అదనపు డబ్బు వసూలు చేసే ఉద్దేశంతో ఈ తతంగాన్ని నడిపిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. సాధారణ అవసరాల కోసం ప్రజలు రూ.10, రూ.20 ఈ-స్టాంపులను కొనుగోలు చేస్తుంటారు. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ కోసం అయితే రూ.50, రూ.100 ఈ-స్టాంపులు కొంటుంటారు. ప్రస్తుతం స్టాంపులు ఎక్కడా అందుబాటులో లేవు. జిల్లా వ్యాప్తంగా వంద మందికి పైగా కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ), స్టాక్‌హోల్డింగ్ కంపెనీలు ఏజెన్సీలు అప్పగించారు. రూ.50 స్టాంపుకు అదనంగా రూ.30, రూ.100 స్టాంపుకు అదనంగా రూ.50 నుంచి రూ.100 వసూలు చేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక్క స్టాంపు కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వ జోక్యం లేకపోవడంతో ప్రైవేటు ఏజెన్సీలు ఆడింది ఆట.. పాడింది పాటగా మారింది. అనంతపురం, శింగనమల, గుత్తి, గుంతకల్లు, పామిడి, తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, కణేకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

ఇచ్చేలా ఆదేశాలిచ్చింది. వాటిపై ప్రభుత్వానికి ఎలాంటి అధికారం ఉండదు. దీంతో ఈ-స్టాంపులను ఆ సంస్థలు, ఏజెన్సీ దక్కించుకున్న వారు మాత్రమే విక్రయిస్తున్నారు. కొంతకాలంగా నాన్ జ్యుడీషియల్ స్టాంపులు కనిపించడం లేదు. కనీసం రూ.10 స్టాంపులు దొరికినా చాలని బాధితులు వేచి చూసే పరిస్థితి నెలకొంది.

ఇతర జిల్లాలకు వెళ్లి..

జిల్లాలో ఈ-స్టాంపులు లభించకపోవడంతో కొందరు ఇతర జిల్లాలకు వెళ్లి కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో నెలన్నర నుంచి స్టాంపుల కొరత నెలకొంది. గుత్తి, పామిడి తదితర ప్రాంతాల వారు కర్నూలు, నంద్యాల జిల్లాలోని ప్యాపిలి, పత్తికొండ, డోన్‌కు వెళ్లి కొని తెచ్చుకుంటున్నారు. ఈ-స్టాంపులు ఎక్కడి నుంచి తెచ్చుకున్నా రిజిస్ట్రేషన్ చేయిస్తామని డాక్యుమెంట్ రైటర్లు చెబుతున్నారు. రెండు ప్రైవేట్ సంస్థలు తమ ఏజెన్సీ నిర్వాహకులకు ఓ విషయం సూటిగా చెబుతున్నట్లు సమాచారం. 'రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్టాంపు డ్యూటీ మీ నుంచి చెల్లిస్తేనే మీకు 300 నుంచి 500 ఈ-స్టాంపులు అందజేస్తాం. లేదంటే ఈ-స్టాంపులను ఇవ్వం' అని చెప్పేశారట. స్టాంపు డ్యూటీ సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించాలి. కానీ ఏజెన్సీ నిర్వాహకుల నుంచి స్టాంపు డ్యూటీ వచ్చేలా ప్రైవేట్ సంస్థలు ప్లాన్ చేసి, సొమ్ము చేసుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే కారణంగా ఏజెన్సీ నిర్వాహకులకు ఈ-స్టాంపులు ఇవ్వకుండా బ్రేక్ వేశారని సమాచారం.

నాన్ జ్యుడీషియల్ స్టాంపులెక్కడ?

నాన్ జ్యుడీషియల్ స్టాంపులను పూర్తిగా నిలిపివేయడంపైనా



విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దేశం మొత్తం మీద నాసిక్‌లో మాత్రమే వీటిని తయారు చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ అవసరాలకు సరిపడా నాన్ జ్యుడీషియల్ స్టాంపులకు ఇండెంట్ ఇచ్చి తెప్పించుకుంటాయి. ప్రభుత్వానికి చేరిన జిల్లా రిజిస్ట్రార్‌లకు, వారి నుంచి సబ్ రిజిస్ట్రార్‌లకు వెళతాయి. అక్కడి నుంచి కార్యాలయాల్లో కొన్ని నిల్వ ఉంచి, స్టాంపు వెండర్లకు ఇచ్చేవారు. అయితే ఆ స్టాంపులు ఇప్పుడు కనిపించడం లేదు. రూ.100 విలువైన నాన్ జ్యుడీషియల్ స్టాంపు కనిపించక మూడేళ్లవుతోందని డాక్యుమెంట్ రైటర్లు చెబుతున్నారు.

సమస్య తీవ్రంగా ఉంది..



జిల్లాలో ఈ-స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. రెండు వారాలుగా ఇబ్బందులు పడుతున్నాం. వారం రోజులుగా పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం, ప్రభుత్వ జోక్యం లేకపోవడంతో ఈ-స్టాంపుల కొరత ఏర్పడుతోంది. రూ.10 నాన్ జ్యుడీషియల్ స్టాంపులు సైతం దొరకని పరిస్థితి. ఈ సమస్య పరిష్కారం కాకపోతే ప్రజలకు ఇక్కట్లు తప్పవు.

- దాసరి సుధాకర్, రాష్ట్ర దస్తావేజు లేకరుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి

పేదలకు అన్నం పెట్టడమే లక్ష్యం

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

నగరంలో మూడు అన్న క్యాంటిన్లు ప్రారంభం



బళ్లారి బైపాస్ రోడ్‌లో అన్నక్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న కేశవ్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 19: పేదలకు అన్నం పెట్టాలన్నదే తమ లక్ష్యమని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. నగరంలోని గుత్తి రోడ్డు, రైల్వే స్టేషన్, బళ్లారి బైపాస్ రోడ్డులోని అన్న క్యాంటిన్లను అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదలకు కూడు, గూడు, గుడ్డ ఇవ్వాలని ఎన్టీఆర్ పరితపించారని అన్నారు. అదే బాటలో 2014-19 సమయంలో చంద్రబాబునాయుడు అన్న క్యాంటిన్లను ఏర్పాటు చేశారని అన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే వాటిని మూసివేసి, పేదలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. పేదలు ఆకలితో ఉండకూడదన్న ఉద్దేశంతో అధికారంలోకి రాగానే తిరిగి అన్న క్యాంటిన్లను ప్రారంభిస్తున్నామని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్బన్‌లో అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. రాబోవు రోజుల్లో అవసరానికి అనుగుణంగా మరిన్ని అన్న క్యాంటిన్లను ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ మేయర్ స్వరూప, బీజేపీ నాయకుడు లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



న్యూటౌన్ జూనియర్ కాలేజీలో భోజనం చేస్తున్న ప్రజలు

తీజ్ వేడుకలకు ఆహ్వానం



కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న బంజారాసంఘం నాయకులు

ఉరవకొండ, సెప్టెంబరు 19: బంజారాలు అత్యంత వైభవంగా జరుపుకునే తీజ్ ఉత్సవాలలో పాల్గొనాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను బంజారాల సంఘం నాయకులు కేశవ్‌నాయక్, మహేష్‌నాయక్ ఆహ్వానించారు. నగరంలో కలెక్టర్‌ను గురువారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. వజ్రకరూరు మండలం రుపానాయక్ తండాలో 24న మోడిలీ, 25న ఘనగోర్, 26న తీజ్ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి ఉత్సవాలకు ఆహ్వానించామని నాయకులు తెలిపారు. రుపానాయక్ తండాలో గురువారం తీజ్ ఉత్సవాలు ఉల్లాసంగా జరుపుకున్నారు. బంజారా సంఘం జాతీయ నాయకుడు తిరుపతి నాయక్ వేడుకలలో పాల్గొన్నారు. ప్రాచీన కళలతో క్రమశిక్షణ నేర్పేది తీజ్ పండుగ అని ఆయన అన్నారు. దేశంలో 12 కోట్ల మంది బంజారాలు నివసిస్తున్నారని, సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షించాలన్న ఉద్దేశంతో కర్ణాటక తరహాలో తండా డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. తీజ్ ఉత్సవాల నిర్వహణకు రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. తీజ్ ఉత్సవాలకు ప్రభుత్వం జాతీయ సెలవు దినాన్ని ప్రకటించాలని కోరారు.

టమోటా పండుతోంది..!



- 25 కిలోల బాక్స్ రూ.800
- ఇవే ధరలు కొనసాగితే లాభాలే
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

యాడికి, సెప్టెంబరు 19: టమోటా ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో రైతులకు ఊరట లభిస్తోంది. మార్కెట్‌లో 25 కిలోల బాక్సు గురువారం రూ.600 నుంచి రూ.800 వరకు ధర పలికింది. ఈ మాత్రం ధరలు నిలకడగా కొనసాగితే తమకు గిట్టుబాటు అవుతుందని రైతులు అంటున్నారు. యాడికి, రాయలచెరువు, లక్షుంపల్లి, వెంగన్నపల్లి తదితర గ్రామాల్లో 150 ఎకరాల్లో టమోటా సాగుచేశారు. ఎకరానికి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టారు. వాతావరణం, ధరలు అనుకూలిస్తే టమోటా సాగు లాభదాయకమే. కానీ ప్రతికూల పరిస్థితులు ఎదురైతే పైసా కూడా తిరిగి రాదు. పంట మొత్తం దిబ్బలో పడేయాల్సి వస్తుంది. ఈ సీజర్ ఆరంభంలో ధరలు అమాంతం పడిపోవడంతో రైతులు నష్టపోయారు. వారం రోజుల నుంచి ధరలు ఆశాజనకంగా ఉన్నాయని అంటున్నారు.

తగ్గుతూ.. పెరుగుతూ..

నెలరోజుల క్రితం టమోటా ధరలు బాక్స్ రూ.100 నుంచి గరిష్ఠంగా రూ.200 పలికాయి. దీంతో రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. వారం క్రితం బాక్స్ ధర రూ.400 మాత్రమే పలికింది. గ్రేడింగ్ ప్రకారం ప్రస్తుతం బాక్స్ రూ.600 నుంచి రూ.800 వరకు పలుకుతోంది. జిల్లాలో వర్షాభావం కారణంగా దిగుబడి తగ్గుతోందని, ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. యాడికి మండల రైతులు అనంతపురం, నంద్యాల జిల్లా ప్యాపిలి మార్కెట్‌కు ఎక్కువగా టమోటాను తరలిస్తుంటారు. తక్కువ దిగుబడి ఉన్న రైతులు తాడిపత్రి, గుత్తి ప్రాంతాలకు తరలించి, అక్కడి వ్యాపారులకు విక్రయిస్తుంటారు. ప్యాపిలి మార్కెట్ ఎక్కువగా జరుగుతుందని, అయితే అక్కడ షూట్ ఉంటుందని తెలిపారు. వంద బాక్స్‌ల టమోటాకు 5 బాక్స్‌లు షూట్ కింద తీసుకుంటారని రైతులు తెలిపారు. వ్యాపారం ఎక్కువగా జరుగుతుండడంతో ధరలు కూడా బాగానే ఉంటాయని రైతులు తెలిపారు.



టమోటాలను గ్రేడింగ్ చేస్తున్న రైతు



యాడికిలో సాగుచేసిన టమోటా పంట

ఇవే ధరలు ఉంటే లాభాలే..



రెండు ఎకరాల్లో టామోటా సాగుచేశాను. పంట దిగుబడి చేతికి వస్తోంది. వారం క్రితం బాక్స్ రూ.400 ప్రకారం విక్రయించాను. ప్రస్తుతం సైజ్‌ను బట్టి బాక్స్ రూ.600 నుంచి రూ.800 వరకు ధర పలుకుతోంది. ఇవే ధరలు నిలకడగా కొనసాగితే మాకు లాభాలు వస్తాయి. టమోటా ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంది.

- శేఖర్, రాయలచెరువు

నాలుగు ఎకరాల్లో సాగుచేశాను



నాలుగు ఎకరాల్లో టమోటా సాగు చేశాను. రెండు ఎకరాల్లో పంట ఇప్పటికే పూర్తయింది. మరో రెండు ఎకరాలలో దిగుబడి రావడం మొదలైంది. వారం క్రితం నుంచి టమోటా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం బాక్స్ ధర రూ.600 నుంచి రూ.800 వరకు నడుస్తోంది. ఇవే ధరలు ఉంటే గిట్టుబాటు అవుతుంది. రైతులం గట్టెక్కుతాము.

- రామాంజనేయులురెడ్డి, వెంగన్నపల్లి

కౌలు రైతు ఆత్మహత్య



శేఖర్ (ఫైల్)

కూడేరు, సెప్టెంబరు 19: మండల పరిధిలోని కొర్రకోడు గ్రామానికి చెందిన కౌలు రైతు శేఖర్(34) అప్పుల బాధతో గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామ పరిధిలో ఎనిమిది ఎకరాల భూమిని శేఖర్ కౌలుకు తీసుకుని, ఐదేళ్లుగా వేరుశనగ, మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. దిగుబడి సరిగా రాక తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు రూ.6.20 లక్షలు పేరుకుపోయాయి. వాటిని తీర్చేమార్గం లేక మనోవేదన చెందేవాడు. ఈ క్రమంలో శేఖర్ భార్య లావణ్య తన పిల్లలతో కలిసి పండుగ కోసం విడపనకల్లు మండలం హావలిగిలోని తన పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శేఖర్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నా డు. చుట్టుపక్కల వారు గమనించేలోగా మృతిచెందాడు. రైతు భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నీరిచ్చి.. ఆదుకోండి..

వామపక్షాలు, రైతుసంఘాల డిమాండ్

కలెక్టరేట్‌కు తరలివచ్చిన నేతలు

మంత్రి కేశవ్, ఎమ్మెల్యేలకు వినతి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

అనంతపురం టౌన్/కల్చరల్, సెప్టెంబరు19: కరువు జిల్లాకు తాగు, సాగునీరిచ్చి ఆదుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలను సీపీఎం, సీపీఐ, రైతుసంఘాల నాయకులు కోరారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో రైతులతో కలిసి గురువారం ఐఏబీ సమావేశం నిర్వహిస్తున్న కలెక్టరేట్‌కు పెద్దఎత్తున నాయకులు తరలివచ్చారు. తొలుత కలెక్టరేట్ ఎదుట తాగు, సాగునీరు అందించి ఆదుకోవాలంటూ నినాదాలు చేసారు. పోలీసులు జోక్యం చేసుకుని.. ప్రజాప్రతినిధులు, అధికారులను కలవడానికి అవకాశం కల్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, సీపీఐ నేతలు జగదీష్ జాఫర్, రైతుసంఘం నాయకులు మల్లికార్జున తదితరులు మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలను వేర్వేరుగా కలిశారు. వారు మాట్లాడుతూ.. తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టులు పొంగిపొర్లుతున్నా జిల్లాలో మాత్రం పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. కనీసం



మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆయకట్టుకు నీరు అందట్లేదన్నారు. నీరున్నా.. సరైన చర్యలు తీసుకోకపోవడంతో దానిని పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తుంగభద్ర ఎగువకాలువను ఆధునికీకరించాలనీ, పీఏబీఆర్‌లో నీటి నిల్వ పెంచేందుకు అవసరమైన భూసేకరణ చేపట్టాలనీ, ఉంతకల్లు జలాశయ పనులు ప్రారంభించాలనీ, బీటీపీకి జీడిపల్లి నుంచి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాలని కోరారు. బిందుసేద్యం పథకాలు పునరుద్ధరించి, హంద్రీనీవా కాలువల నిర్మాణం పూర్తి చేయాలనీ, చెరువులు, కుంటలను నీటి కాలువలతో అనుసంధానించాలనీ, ఉమ్మడి జిల్లాలో తాగునీటి పథకాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆ మేరకు వినతిపత్రాలు అందించారు.

ఆ ఇంట.. నూరేళ్ల పండుగ

కళ్యాణదుర్గం మండలం బోయలపల్లికి చెందిన నల్లబోతుల హనుమంతప్ప నిండు నూరేళ్ల జీవితం పూర్తి చేసుకున్నారు. కొడుకులు, కూతుళ్లు, మనవళ్లు, మనవరాండ్రు, ముని మనవళ్లు, ముని మనవరాండ్రు, వారి జీవిత భాగస్వాములు.. ఇలా సుమారు 50 మంది కుటుంబ సభ్యుల సమక్షంలో గురువారం 101వ పుట్టిన రోజు వేడుకను ఘనంగా నిర్వహించుకున్నారు. హనుమంతప్పకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. ఒక్కొక్కరికి ఇద్దరు చొప్పున సంతానం. అంటే.. మొత్తం పది మంది మనవళ్లు, మనవరాండ్రు. వీరికి పెళ్లిళ్లయాయ్యి. వీరి పిల్లల్లో కొందరికి కూడా పెళ్లిళ్లయ్యాయి. ఇప్పటికి తన సంతతిలో మూడు తరాలను చూసిన ఆయన.. తన తండ్రి, తాతలతో కలిపి ఐదారు తరాలను చూసినట్లు. ప్రకృతి సహకరిస్తే.. ఇంకోతరాన్ని చూసేందుకూ ఆయన సిద్ధంగా ఉన్నారు. రక్త సంబంధీకులందరూ కలిసి ఆయనకు



జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న హనుమంతప్ప

అరుదైన పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. హనుమంతప్ప భార్య పదేళ్ల క్రితం కన్నుమూశారు. ఇప్పటికీ ఆయన నడవగలరని, ఆహారం కొద్దిగా మాత్రమే తీసుకుంటారని కుటుంబ సభ్యులు తెలిపారు.

-కళ్యాణదుర్గం

అక్కినేనితో అనంత బంధం

జ్ఞాపకాలు

- 1972లో తొలిసారి నగరానికి రాక
- 1994లో మాజీ రాష్ట్రపతి నీలం చేతుల మీదుగా సత్కారం
- నేడు అక్కినేని 101వ జయంతి




నాగరాజుకు తన ఆటోగ్రాఫ్‌తో అక్కినేని అందించిన ఫొటో

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 19: ఎవర్ గ్రీన్ హీరో అక్కినేని నాగేశ్వరరావుకు నిండు నూరేళ్లు..! ఆయన 101వ జయంతి వేడుకలను శుక్రవారం అభిమానులు నిర్వహించుకోనున్నారు. ఆయన భౌతికంగా దూరమైనా, అభిమానుల గుండెల్లో పదిలంగా ఉన్నారు. అనంతపురంతో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉంది. 1972 నవంబరు 24న త్యాగరాజ సంగీత సభ ఆధ్వర్యంలో నగరంలోని రఘువీర థియేటర్‌లో భారతరత్న పండిట్ రవిశంకర్ సితార్ కచేరి జరిగింది. అక్కినేని నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అప్పట్లో హోస్పేటలో భక్తతుకారం షూటింగ్ జరుగుతోంది. బిజీ షెడ్యూల్ ఉన్నా.. ఆయన అనంతపురానికి వచ్చారు. ఆ తర్వాత 1994లో మరోసారి అనంతపురం నగరానికి వచ్చారు. శాంతి థియేటర్ నుంచి లలితకళా పరిషత్ వరకు వరకు ఆయనను అభిమానులు ఊరేగించారు. పోలీస్ కాంప్లెక్స్ అతిథి భవనంలో ఆ రోజు ఏఎన్నార్ బస చేశారు. ఆ రోజు సాయంత్రం లలితకళా పరిషత్‌లో మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి అక్కినేనిని ఘనంగా సన్మానించారు. అదే సమయంలో అభిమానులు ఆయనకు ఉంగరాన్ని బహూకరించారు. మరణం చేరువవుతోందని తెలిసినా.. ఆయన నటనను వీడలేదు. 'మనం' సినిమాలో కుటుంబ సభ్యులతో కలిసి నటించారు. ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని, క్యాన్సర్‌తో పోరాడి.. పరిపూర్ణ జీవితాన్ని అనుభవించిన అక్కినేని జీవితం స్ఫూర్తిదాయకం.

22న అక్కినేని స్వరాభిషేకం

అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతిని పురస్కరించుకుని అనంతపురం అక్కినేని అభిమానుల ఆధ్వర్యంలో ఈ నెల 22న అక్కినేని స్వరాభిషేకం నిర్వహించనున్నారు. నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం సాయంత్రం జరిగే ఈ కార్యక్రమంలో జిల్లాతోపాటు వివిధ ప్రాంతాల కళాకారులు, గాయకులు పాల్గొంటున్నారు. అక్కినేని నాగేశ్వరరావు నటించిన సినిమాల్లోని పాటలతో ఆయనకు స్వరనీరాజనం పలకనున్నారు.

గుర్తు పట్టి పలకరించేవారు..



తనను అభిమానించే ప్రతి ఒక్కరినీ ఏఎన్నార్ గుర్తు పట్టి మరీ పలుకరించేవారు. 1994లో అనంతపురం వచ్చిన అక్కినేని నాగేశ్వరరావుకు మేము ఉంగరాన్ని బహూకరించాము. ఆ తర్వాత ఎపుడైనా హైదరాబాద్ వెళితే ఆయనను కలిసేవాళ్లం. మమ్మల్ని గుర్తు పట్టి పేర్లతో పలకరించేవారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకునేవారు. మేము ఎప్పుడు కలిసినా ఆయన చేతి వేలికి మేము బహూకరించిన ఉంగరం ఉండేది. అంతగా అభిమానులను గౌరవించేవారు. ఆటోగ్రాఫ్‌తో కూడిన తన ఫొటోను మాకు ఇచ్చారు.

-నాగరాజు, అక్కినేని అభిమాని

అనంత గురించి అడిగారు..



అక్కినేని నాగేశ్వరరావు రచయితలను ఎంతగానో గౌరవించేవారు. 1972లో త్యాగరాజ సంగీత సభ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను రచయితలం అందరం కలిసి సన్మానించాము. 2010 సెప్టెంబరు 20న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన ఆయన జన్మదిన వేడుకలకు మమ్మల్ని ఆహ్వానించారు. అపుడు వెళ్లి నాగేశ్వరరావును కలిసి మాట్లాడించాము. మీ అనంతపురం జిల్లా ఎలా ఉంది? అని అడిగారు. ఆ క్షణాన్ని ఎన్నటికీ మరువలేను.

-కంబదూరి నబీరసూల్, కవి

నేడు సీతారాం ఏచూరి సంతాప సభ

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 19: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాపసభను శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లాకేంద్రంలోని లలితకళాపరిషత్‌లో నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సభకు టీడీపీ ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌తోపాటు పలువురు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు.

ముగిసిన ఎంబీబీఎస్ తొలివిడత జాయినింగ్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 19: ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో అనంత కళాశాలలో 138 మంది మెడికోలు రిపోర్ట్ చేసుకున్నారు. గురువారం తొలివిడత రిపోర్ట్ ప్రక్రియ ముగియగా 128 మంది రాష్ట్రకోటాలో సీట్లుపొందిన మెడికోలు రిపోర్ట్ చేసుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు తెలిపారు. జాతీయకోటాలో 21 సీట్లకుగాను 10 మంది జాయిన్ అయ్యారన్నారు.

జీడిపల్లికి 915 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 19: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 915 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 886 క్యూసెక్కుల నీరు వెళుతోందన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో నీటి నిల్వ 1.674 టీఎంసీలు ఉందని అధికారులు వెల్లడించారు.

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 19: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు శుక్రవారం నిర్వహించనున్నారు. జడ్పీలోని ప్రధాన సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ స్టాండింగ్ కమిటీ, వర్క్స్ స్టాండింగ్ కమిటీ, గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నారు. జడ్పీ అదనపు సమావేశ మందిరంలో అదే సమయానికి విద్య-వైద్యం స్టాండింగ్ కమిటీ, మహిళా-శిశు సంక్షేమ స్టాండింగ్ కమిటీ, వ్యవసాయం స్టాండింగ్ కమిటీ, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నారు.

6 నుంచి టీటీసీ పరీక్షలు

అనంతపురం విద్య, సెప్టెంబరు 19: టీటీసీ థియరీ పరీక్షలు-2024 వచ్చేనెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు డీఈఓ వరలక్ష్మి, పరీక్షల విభాగ సహాయ కమిషనర్ గోవింద్ నాయక్ గురువారం ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, అదేవిధంగా 3.30 గంటల నుంచి 4.30 గంటల వరకు మూడు విడతలుగా పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులు www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి పరీక్షల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

బెంగళూరు-ధర్మవరం రైలు స్టాపింగ్ తొలగింపు

గుంతకల్లు, సెప్టెంబరు 19: బెంగళూరు-ధర్మవరం మధ్య నడుస్తున్న డెము రైలు (నెం. 06595/96) బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో స్టాపింగ్‌ను తొలగించినట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ రైలును సెప్టెంబరు 20 నుంచి డిసెంబరు 20వ తేదీ వరకు 92 రోజులపాటు బెంగళూరు కంటోన్మెంటు స్టేషన్‌లో నిలపకుండా పంపనున్నట్లు తెలియజేశారు.

ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్టు

గుత్తి, సెప్టెంబరు 19: సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను రైల్వే పోలీసులు గురువారం పట్టుకున్నారు. ధర్మవరానికి చెందిన ఖాదర్‌బాషా బీటెక్ చదివాడు. మరో యువకుడితో సైబర్ నేరాలకు పాల్పడుతూ జల్సాల కు అలవాటు పడ్డారు. సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా రైల్వే పోలీసులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద వారిని పట్టుకుని అనంతపురానికి తరలించినట్లు సమాచారం.

విషజ్వరంతో మహిళ మృతి

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 19: కెంచానపల్లి గ్రామానికి చెందిన జ్యోతి (33) విషజ్వరంతో గురువారం మృతి చెందిందివ. మూడురోజుల నుంచి జ్వరంతో బాధపడుతూ ఉండేదని, బుధవారం జ్వరం ఎక్కువ కావడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.






ఐఏబీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్, హాజరైన అధికారులు

అన్ని చెరువులకూ నీరు

- మొహమాటం లేదు.. దామాషా ప్రకారం వాటా
- హెచ్చెల్సీ వాటాలో 16.368 టీఎంసీలు తాగునీటికి..
- సాగుకు 10 టీఎంసీల కేటాయింపు
- శింగనమల చెరువుకు ముందుగానే నీరు
- ఐఏబీ సమావేశంలో మంత్రులు కేశవ్, సత్యకుమార్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19: ఉమ్మడి జిల్లాలోని ప్రతి చెరువునూ నింపడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శింగనమల చెరువుకు షెడ్యూలు తేదీలకంటే ముందుగానే నీటి విడుదల చేయాలని జలవనరుల శాఖ ఇంజనీర్లకు సూచించారు. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి కాలవ పటిష్టతను పరిశీలించాలని సూచించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకోవాలని, ఎప్పటికప్పుడు కలెక్టర్‌కు సమాచారం అందించి, పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గడిచిన ఐదేళ్ల రైతులు నిర్లక్ష్యానికి గురయ్యారని, వారి సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. అన్నంపెట్టే రైతులతో పాటు అన్ని వర్గాలకు మేలు చేయడమే సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నీటి ప్రాధాన్యంపై రైతులు, ప్రజలలో అవగాహన పెంచాలని, హెచ్చెల్సీ నీటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొహమాటాలు, నిర్లక్ష్యం వద్దని, దామాషా ప్రకారం అన్ని ప్రాంతాలకు నీటి పంపిణీ చేయాలని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయిన సమయంలో సీఎం చంద్రబాబు వేగంగా స్పందించారని అన్నారు. నీటి వృథాను అరికట్టాలని తనను, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అధికారులను అప్రమత్తం చేశారని కేశవ్ అన్నారు. ఇంజనీరింగ్ నిపుణుడు కన్నయ్య నాయుడు ఆధ్వర్యంలో స్టాప్‌లాగ్ ఏర్పాటు చేసి, నీటి వృథాను అరికట్టారని అన్నారు. సీఎం చంద్రబాబు, కన్నయ్య నాయుడు సహా ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది, ప్రభుత్వాన్ని అభినందిస్తూ సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశం అనంతరం మంత్రులు కేశవ్, సత్యకుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. తుంగభద్ర జలాశయం నుంచి 26.368 టీఎంసీల నీటిని హెచ్చెల్సీ వాటాగా కేటాయించారని, అందులో సాగుకు 16.368 టీఎంసీలు, తాగునీటికి 10 టీఎంసీలు కేటాయించామని తెలిపారు. కాలువలకు నీటిని విడుదల చేసే తేదీలను నిర్ణయించి, రైతులకు మేలు చేసే బాధ్యతను ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా నిర్వర్తించేలా నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కరువు జిల్లా రైతాంగానికి సాగునీరు అందించే విషయంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేపట్టకుండా 2025 వరకు నిషేధం విధిస్తూ 2020 జూలైలో జీవో 365ను విడుదల చేశారని, రైతాంగం పట్ల ఆ ప్రభుత్వానికి ఏ పాటి చిత్తశుద్ధి ఉందో దీన్ని బట్టే అర్థమవుతోందని అన్నారు.

సకాలంలో సాగుకు నీరివ్వాలి..



టీబీ డ్యాం నుంచి సకాలంలో నీటిని విడుదల చేయడంతో రాయదుర్గంలోని రైతులు పంటలు సాగు చేశారు. ఓ వైపు నీటి విడుదల, మరోవైపు వర్షాలు రావడంతో పరిస్థితి సానుకూలంగా ఉంది. హెచ్చెల్సీ పూడికతీత పనులు చేపట్టాలి. ఐదేళ్లుగా హెచ్చెల్సీని నిర్వీర్యం చేశారు. ఆయకట్టు రైతుల ద్వారా కట్టిన పన్నులకు అనుగుణంగా కాడా నుంచి నిర్వహణకు అవసరమైన నిధులను రాబట్టాలి.

- కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం ఎమ్మెల్యే


లస్కర్లను నియమించాలి..



నీటి అనంతరం వృథా కాకుండా, చౌర్యం జరగకుండా లస్కర్లను నియమించి నీటిని కాపాడాలి. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి పిచ్చిమొక్కలను తొలగించాలి. తెగిన కాలువలకు మరమ్మతులు చేయాలి. గత ఐదేళ్లల్లో జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కాలువల నిర్వహణను గాలి కొదిలేశారు. తాడిపత్రి నియోజకవర్గంలోని సుబ్బరాయసాగర్, ముచ్చుకోటలతోపాటు చెరువులను నీటితో నింపాలి. ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

- జేసీ అశ్మిత్‌రెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం రైతులను ఆదుకోవాలి



జిల్లాలోనే అత్యంత వెనుకబడిన కళ్యాణదుర్గం ప్రాంతంలోని రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలి. కళ్యాణదుర్గానికి హెచ్చెల్సీ నుంచి తుంగభద్ర జలాలు, హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు ఇవ్వాలి. జీడిపల్లి నుంచి బీటీపీకి నీటిని తీసుకెళ్లే కాలువ పనులను వెంటనే పూర్తి చేయాలి. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పూర్తి చేయడానికి ప్రభుత్వం తరఫున కలెక్టర్ బాధ్యత తీసుకుని చొరవ చూపాలి.

- అమిలినేని సురేంద్రబాబు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే

గుంతకల్లు నియోజకవర్గంపై దృష్టిపెట్టాలి



గుంతకల్లు నియోజకవర్గానికి అటు హెచ్చెల్సీ ద్వారా తుంగభద్ర జలాలు, ఇటు హంద్రీనీవా ద్వారా కృష్ణా నీటిని అందించాలి. గుంతకల్లు నియోజకవర్గం మీదుగా రెండు కాలువలు వెళ్తాయి. నియోజకవర్గానికి హెచ్చెల్సీ, హంద్రీనీవా ద్వారా నీటి కేటాయింపులు పెరగాలి. జీబీసీ ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలి.

- గుమ్మనూరు జయరాం, గుంతకల్లు ఎమ్మెల్యే

అధికారులు ఉదాసీనత వీడాలి..



రైతుల కష్ట, నష్టాలపై అధికారులు ఉదాసీనత వీడాలి. అన్నదాతలతోపాటు అన్ని వర్గాల యోగక్షేమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుంది. వర్షాలు కురుస్తున్న సమయంలోనూ రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత బాధాకరం. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఉమ్మడి జిల్లా ప్రజలకు వర్తింపచేసి సద్వినియోగం చేసుకునేలా బాధ్యత తీసుకుంటా. వరదలతో టీబీ డ్యాం గేట్ కొట్టుకుపోయిన సమయంలో సీఎం చంద్రబాబు, మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పందించిన తీరు అభినందనీయం. జలరంగ నిపుణులు కన్నయ్యనాయుడు తన అనుభవంతో డ్యాంలో నీటిని వృథా కాకుండా ప్రవాహంలోనే గేటును అమర్చడంతో కొత్త అధ్యయనానికి నాంది పలికారు.

- సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి

ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి



జలవనరులశాఖ ఇంజనీర్లు కాలవల మీద క్షేత్రస్థాయిలో పర్యటించాలి. అప్పుడే నీటి వృథా, చౌర్యాన్ని అరికట్టవచ్చు. సమస్యలను సైతం తెలుసుకోవచ్చు. వివిధ ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుని నీటిని పరిరక్షించుకోవాలి. కర్ణాటక ప్రాంతంలో అధికంగా వర్షాలు కురవడంతో టీబీ డ్యాంకు 170 టీఎంసీల నీటి నిల్వను అంచనా వేయగా, హెచ్చెల్సీకి 26.368టీఎంసీల నీరు కేటాయించారు.

-వినోద్‌కుమార్, కలెక్టర్, ఐఏబీ చైర్మన్

వెంటనే నీటిని విడుదల చేయండి



ఐదేళ్లుగా వివక్షకు గురైన శింగనమల నియోజకవర్గ రైతులు, ప్రజలకు సాగు, తాగునీరు అందించి ఆదుకోవాలి. నియోజకవర్గంలో డ్యాంలు, పెద్ద చెరువులు ఉన్నప్పటికీ నీరు అందడం లేదు. నియోజకవర్గానికి 10టీఎంసీల నీరు కేటాయించాలి. అక్టోబరు వరకు కాకుండా వెంటనే నీటిని విడుదల చేసి ప్రజలు, రైతులను ఆదుకోవాలి. సాగు చేసిన పంటలు నీరు అందక ఎండిపోతున్నాయి. ఆన్‌అండ్ ఆఫ్ పద్ధతిలో కాకుండా రెగ్యులర్‌గా నీటిని సరఫరా చేయాలి.

- బండారు శ్రావణి శ్రీ, శింగనమల ఎమ్మెల్యే

నగరంలో నీటి వినియోగం పెరిగింది




జనాభా పెరగడంతో నగరంలో నీటి వినియోగం పెరిగింది. సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులు, చెరువులను నీటితో నింపాలి. నేషనల్ పార్కు వద్ద ఉన్న చెక్‌డ్యాంకు నీటి పంపిణీ జరగాలి. తాగునీటి సమస్య రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి.

-దగ్గుపాటి ప్రసాద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే

నీటి విడుదల తేదీల ప్రకటన

టీబీ డ్యాం నుంచి వచ్చే నీటి విడుదల తేదీలను హెచ్చెల్సీ ఎస్ఈ, ఐఏబీ కన్వీనర్ రాజశేఖర్ ప్రకటించారు. టీబీ డ్యాం నుంచి హెచ్చెల్సీకి జూలై 22వ తేదీన విడుదల చేశారు. పీబీఏబీఆర్‌కు జూలై 28వ తేదీన చేరాయి. ఎంపీఆర్‌కు జూలై 30వతేదీన నీటిని విడుదల చేశారు. హెచ్ఎల్ఎంసీకి ఆగస్టు 10వతేదీన, జీబీసీకి ఆగస్టు 10వతేదీన నీటిని విడుదల చేశారు. ఎంపీఆర్ సౌత్, నార్త్‌కెనాల్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌కు ఈ వారంలోనే నీటిని విడుదల చేస్తామని తెలిపారు.

చివరి ఆయకట్టు వరకు నీటి పంపిణీ జరగాలి..



చివరి ఆయకట్టు వరకు నీటి పంపిణీ జరగాలి. అప్పుడే రైతుల సమస్యలు తీరుతాయి. హెచ్చెల్సీ నీరు తక్కువగా ఉన్న చోట హంద్రీనీవా నీటిని అందించాలి. గత రెండుమూడేళ్లుగా రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. కాలవ ఆధునికీకరణలో సైడ్‌వాల్స్‌లో మాత్రమే సిమెంట్ కాంక్రీట్ వేయాలి. అడుగు భాగాన కాంక్రీట్ వేయకుండా ఉంటేనే బోర్ల రీచార్జి జరుగుతుంది. పీఏబీఆర్ పూర్తి స్థాయి నీటి నిల్వకు అవసరమైన పెండింగ్‌లో ఉన్న భూసేకరణ చేయాలి.

- శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

ఉమ్మడి జిల్లాలో అన్ని ప్రాంతాలకూ నీరందించాలి



ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలి. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, జలవనరులశాఖ అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ నిర్ణయాలకు పూర్తి సహకారం అందిస్తాం. కరవు జిల్లాను అభివృద్ధి చేయడంతో ముందుంటాం.

- బోయ గిరిజమ్మ, జడ్పీ చైర్‌పర్సన్

రావత్ సెంచరీ

- చేరువలో సంజు శ్యాంసన్
- దులీప్ ట్రోఫీ చివరి పోటీలు ప్రారంభం



రావత్ సెంచరీ అభివాదం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19: దులీప్ ట్రోఫీలో భాగంగా అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్ ఏ స్టేడియంలో గురువారం ఇండియా-ఎ, సి జట్ల మధ్య ఆట ప్రారంభమైంది. తొలిరోజు ఎ-జట్టు ఆటగాడు శషావత్ రావత్ సెంచరీ సాధించాడు. టాస్‌గెలిచిన ఇండియా సి జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేపట్టిన ఇండియా-ఎ జట్టులో ఓపెనర్లు ప్రథమ్‌సింగ్ (6), మయాంక్ అగర్వాల్ (6), తిలక్‌వర్మ(5), రియాన్ పరాగ్ (2), కుమార్ కుషర్గ (0) విఫలమయ్యారు. ఆ తరువాత షాంశ్ ములనీ 44, తనుష్ కొటియాన్ 10 పరుగులు చేశారు. శాషావత్ రావత్ 235 బంతుల్లో 15 బౌండరీలతో 122 పరుగులు, ఆవేష్‌ఖాన్ 16 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా-ఎ జట్టు 77 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 224 పరుగులు సాధించింది. ఇండియా-సి బౌలర్లలో అన్షుల్ కాంబోజ్ 3 వికెట్లు, వైశాక్ విజయ్‌కుమార్ 2, గౌరవ్‌యాదవ్ ఒక వికెట్ తీసుకున్నారు.

సెంచరీకి చేరువలో సంజు

అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్ బీలో ఇండియా-బి, డి జట్ల మధ్య పోటీ సాగింది. ఈ మ్యాచ్‌లో సంజు శ్యాంసన్ సెంచరీకి చేరువయ్యారు. బి జట్టు టాస్‌గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసి ఇండియా-డి జట్టులో ఓపెనర్లు దేవదత్తు పడిక్కిల్ 50 పరుగులు, కేఎస్ భరత్ 52 పరుగులతో 105 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం వచ్చిన రికీభుయ్ 56 పరుగులు, నిషాంత్ సింధు 19 పరుగులు చేశారు. శ్రేయాస్ అయ్యర్ మరోసారి డకౌట్ అయ్యాడు. సంజు శ్యాంసన్ 89 పరుగులు, శరాన్ష్‌జైన్ 22 పరుగులతో క్రీజులో ఉన్నారు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా-డి జట్టు 77 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. ఇండియా-బి బౌలర్లు రాహుల్ చాహర్ 3 వికెట్లు, నవదీప్ సైనీ, ముకేష్‌కుమార్ చెరో వికెట్ తీశారు.



సంజూ శాంసన్ (89 బ్యాటింగ్)

కియ సంస్థ భారీ వితరణ

- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి రూ.5 కోట్ల విలువ చేసే వైద్య పరికరాల అందజేత

అనంతపురం టౌన్, సెప్టెంబరు 19: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి కియాపరిశ్రమ సంస్థ యాజమాన్యం రూ.5 కోట్లు విలువ చేసే వైద్యపరికరాలు అందజేశారు. రూ.2.50 కోట్లు విలువ చేసే ఐవీయూఎస్, ఎఫ్ఎఫ్ఆర్ యంత్రంతోపాటు రూ. 2.50కోట్లు విలువచేసే స్టంట్స్, కాథిలాక్స్, అనుబంధ వైద్యచికిత్స పరికరాలు వితరణ చేశారు. గురువారం వైద్యశాఖామంత్రి సత్యకుమార్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్ సమక్షంలో కియాపరిశ్రమ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా కియ సంస్థ ప్రతినిధులను మంత్రి, ఎమ్మెల్యే, వైద్యాధికారులు సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. ఇటీవల కాలంలో గుండె సమస్యలు అధికమయ్యాయని, ఇందుకోసం ప్రతి సీహెచ్‌సీలో 45వేల ఇంజెక్షన్‌లు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. క్యాన్సర్ నివారణ, చికిత్స కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. కియ సంస్థ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భారీస్థాయిలో వైద్యపరికరాలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఇదేస్ఫూర్తిని ఇతర కార్పొరేట్ సంస్థలు కొనసాగించి విరాళాలు ఇవ్వడానికి ముందుకురావాలని అలాంటి వారికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నామని, డాక్టర్లు మరింత బాధ్యతగా పనిచేయాలని సత్యకుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, సూపర్ స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, కార్డియాలజీ వైద్యులు డాక్టర్ సుభాష్‌చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు



వైద్య పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

ఓబీసీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



సమావేశంలో పాల్గొన్న ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 19: ఆర్థికంగా, విద్య, సామాజిక రంగాల్లో ఓబీసీలు అభివృద్ధి చెందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటు అందించాలని అనంతపురం ఎంపీ, ఓబీసీ కమిటీ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ కోరారు. గురువారం న్యూఢిల్లీ పార్లమెంట్ అన్నెక్స్ భవనంలో నిర్వహించిన ఓబీసీ కమిటీ సమావేశంలో అంబికా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గుర్తింపు కలిగిన ఓబీసీ యువతకు ఉద్యోగ, విద్యా రంగాల్లో పూర్తిస్థాయిలో రిజర్వేషన్లు అమలు చేయడంతోపాటు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు.

ఆలయాలు.. సంస్కృతికి నిలయాలు

● గోవిందానంద సరస్వతి స్వామి


రాములవారికి పూజలు నిర్వహిస్తున్న స్వామీజీ

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 19: హిందూ దేవతా మందిరాలు మన దేశ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలని కర్ణాటక రాష్ట్రం తలకాడులోని బాలకృష్ణానంద మహా సంస్థానాధిపతి గోవిందానంద సరస్వతి స్వామి పేర్కొన్నారు. గురువారం అనంతపురం వచ్చిన ఆయన మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయాన్ని సందర్శించారు. కాశీవిశ్వేశ్వరస్వామితో పాటు శారదామాత, రాములవారి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మనలోని శ్రద్ధ, భక్తిప్రపత్తులకు మూలకేంద్రాలు ఆలయాలని... కులమతాలు, రాజకీయాలకతీతంగా అందరినీ కలుపుకుని దేవాలయ వ్యవస్థ పరిరక్షణ కు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఈఓ సాకే రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, హర్ష, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు కార్యదర్శి బదిలీ

అనంతపురంరూరల్, సెప్టెంబరు19: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి బదిలీ అయ్యారు. ఓడీపై కర్నూలుకు బదిలీ చేస్తూ సంబంధిత శాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కర్నూలులో పనిచేస్తున్న గోవిందు ఇక్కడకురానున్నారు. బదిలీపై వెళుతున్న కార్యదర్శికి గురువారం మార్కెట్‌యార్డులోని మీటింగ్‌హాల్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. యార్డు ఉద్యోగులు శాలువ, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

నేడు మండలస్థాయి స్కూల్ గేమ్స్

గార్లదిన్నె, సెప్టెంబరు 19: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14, 17 బాలురు, బాలికలకు మండలస్థాయి క్రీడా పోటీలను మండలకేంద్రలోని ఆదర్శ పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి తారా చంద్రానాయక్ గురువారం ప్రకటనలో తెలిపారు. శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు నిర్వహించే క్రీడాపోటీలకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యారులందరు అర్హులన్నారు.

నార్పల: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వహణ మండల సమన్వయ కర్త అంజనేయులు తెలిపారు.ఎంఈఓలు కృష్ణయ్య, నారపరెడ్డి,పాఠశాల హెచ్ఎం రవికుమార్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.

సాగునీటి కోసం ధర్నా

గార్లదిన్నె, సెప్టెంబరు 19 : పంటలు సాగుచేసేందుకు సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. సాగునీరు, ఇన్‌పుట్, ఇన్సూరెన్స్ విడుదల చేయా లంటూ రైతు సంఘం, సీపీఎం నాయకులు గురువారం స్థానిక బస్టాండ్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ... ఎంపీఆర్ డ్యాం ద్వారా దక్షిణ కాలువకు సాగునీరు విడుద చేసి చివరి ఆయకట్టు వరకు అందించాలన్నారు. అదేవిధంగా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ మంజూరు చేయాలని, తల్లివందనం పథకం వెంటనే అమలు చేయాలని, మండలంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండలాధ్యక్షులు చెన్నారెడ్డి, నాగమ్మ, రాము, రాముడుతదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్, హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు, ఏడుగురికి ఏడేళ్ల జైలు

అనంతపురం క్రైం,సెప్టెంబరు 19: పెద్ద మొత్తంలో డబ్బు కాజేసి, ఒకరిని కిడ్నాప్ చేసి ఆపై హత్య చేసిన కేసులో అనంతపురం 4వ సెషన్స్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఒకరికి జీవిత ఖైదు, ఏడుగురికి చెరో ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. అనంతపురం నగరంలోని నీరుగంటి వీధికి చెందిన భాగ్యలక్ష్మి తన తమ్ముడు విజయ్‌మోహన్‌తో కలిసి 2015, సెప్టెంబరు 12న పామిడి పట్టణాని కి వెళ్లారు. శిక్ష పడిన ఎనిమిది మంది నిందితులు మూకుమ్మడిగా అక్క, తమ్ముడిని కిడ్నాప్ చేసి, బెదిరించి వారి బ్యాంకు ఖాతాలోని రూ.47లక్షలను విత్‌డ్రా చేయించారు. ఈ విషయం ఎక్కడ బయట పడుతుందోననే ఉద్దేశంతో విజయ్‌మోహన్‌ను అదే ఏడాది డిసెంబరు 25న గొంతు నులిమి చంపి, నీటి కాలువలో పడేసినట్లు భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ రవిశంకర్‌రెడ్డి అదేనెల 31న కేసు నమోదు చేశారు. అనంతరం 4వ సెషన్సు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో న్యాయాధికారి శోభారాణి 13మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో తీర్పు వెలువరించారు. ఈ కేసును న్యాయవాది సృజన ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ ప్రతాప్‌రెడ్డి, అప్పటి సీఐ రవిశంకర్ రెడ్డి, కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుళ్లు సౌరెడ్డి, లక్ష్మీనారాయణలను ఎస్పీ జగదీష్ అభినందించారు.

శిక్ష పడింది వీరికే..

బసిరెడ్డి రమేష్‌రెడ్డి (జీవిత ఖైదు), కె సూర్యనారాయణరెడ్డి, ఎల్ సుదర్శన్‌రెడ్డి, ఆర్.లక్ష్మి, ఎం నాగజు, ఎం చంద్రాయుడు, సి హరినాథ రెడ్డి, ప్యాపిలి మురళి(వీరందరికీ ఏడేళ్ల జైలు, రూ.5వేలు జరిమానా) ఉన్నారు. వీరు తెలికి, మామిళ్లవారిపల్లి, తుట్రపల్లి, అనంతపురం టౌన్, రామాపురం, నాగలూరు, మామిళ్లపల్లి, సూర్యదేవరనగర్ ప్రాంతాలకు చెందిన వారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అనంతపురం క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కోవూరు నగర్‌కు చెందిన సాయిలోహిత్ (19)ఈ నెల 10వతేదీ సంఘమేష్ సర్కిల్‌లో బైక్ స్కిడ్ కావడంతో కింద పడి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసుల తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం క్రైం: భార్యాపిల్లలకు దూరంగా ఉంటూ మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వినాయకనగర్‌కు చెందిన మల్లెల శ్రీనివాసులు(51)గత ఏడేళ్లుగా భార్య, పిల్లలకు దూరంగా ఉంటున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీనివాసులు గురువారం తన ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్స్‌కవేటర్ ఢీకొని యువకుడి దుర్మరణం

హిందూపురం, సెప్టెంబరు 19: మండలపరిధిలోని నక్కలపల్లి వద్ద గురువారం ముళ్లకంపలు తొలగిస్తున్న సమయంలో ఎక్స్‌కవేటర్ వెనక్కు వచ్చే సమయంలో ఢీకొని సంతోష్‌కుమార్ (20)అనే యువకుడు దుర్మరణం చెందినట్లు అబ్‌గ్రేడ్ సీఐ ఆంజనే యులు తెలిపారు. అనంతపురానికి చెందిన కోనేటి నారాయణస్వామి ఐదేళ్లుగా హిందూపురం ప్రాంతంలో జపాన్ తుమ్మచెట్లు తీసుకుని బొగ్గులు కాల్చుతూ జీవనం సాగిస్తున్నాడు. సోమందేపల్లి మండలానికి చెందిన డ్రైవర్ మస్తాన్ గురువారం ముళ్లకంపలు తొలగిస్తూ వెనక్కు వస్తున్న సమయంలో ఎక్స్‌కవేటర్ ఢీకొనడంతో సంతోష్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. హిందూపురం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఇదిలా ఉంటే తన కుమారుడికి ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌కు కొంతకాలంగా మనస్పర్థలున్నాయని దీంతో డ్రైవర్ కావాలనే ఢీకొట్టి తన కుమారుడిని చంపాడని సంతోష్ తండ్రా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు.


బళ్లారి బైపాస్‌లో హాజరైన జనం


బళ్లారి బైపాస్‌లో భోజనం చేస్తున్న జనం

అన్నక్యాంటిన్లలో సందడే సందడి


గుత్తిరోడ్డులో భోజనం వడ్డిస్తున్న మంత్రి కేశవ్ తదితరులు


జూనియర్ కాలేజీ వద్ద క్యాంటిన్‌లో..

రాప్తాడుకు సాగు, తాగునీరందించాలి

● వీలైనన్ని చెరువులకు నీరివ్వాలి
● ఐఏబీ చైర్మన్, కలెక్టర్‌కు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి



అనంతపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గానికి హెచ్ఎల్సీ, హంద్రీనీవా నుంచి వీలైనంత మేరకు సాగు, తాగు నీరందించాలని జిల్లా కలెక్టర్, ఐఏబీ చైర్మన్ వినోద్‌కుమార్‌కు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో గురు వారం నిర్వహించిన ఐఏబీ సమావేశానికి అనివార్య కారణాల తో హాజరుకాలేకపోయానంటూ ఆమె ఐఏబీ చైర్మన్‌కు లేఖ ద్వారా తెలుపుతూ, నియోజకవర్గంలో నెలకొన్న తాగు,సాగు నీటి సమస్యలను విన్నవించారు. పీఏబీఆర్, హంద్రీనీవా ద్వారా రాప్తాడు నియోజకవర్గానికి తాగు, సాగు నీరు అందుతోందని పేర్కొన్నారు. అయితే పీఏబీఆర్ కుడి కాలువ నుంచి గత కొన్నేళ్లుగా తమ నియోజకవర్గానికి రావాల్సిన నీరు రావడం లేదన్నారు. తద్వారా చాలా మంది రైతులు నష్టపోతున్నారన్నారు. ఈ సారైనా కేటాయింపులు చేసిన విధంగా నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆ లేఖలో కలెక్టర్‌ను కోరారు. పీఏబీఆర్ నుంచి సత్యసాయి తాగునీటి పథకం కింద నియోజ కవర్గంలోని చాలా గ్రామాలకు నీరు సరిగా అందడం లేదన్నారు. ఈ పథకాల నిర్వహణలో లోపాలు, కార్మికులు తరచూ సమ్మెలకు వెళ్లడం వల్ల నీటి సరఫరా ఆగిపోతోందన్నారు. దీంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్మికులు నిరంతరం విధుల్లో ఉండేలా వారి సమస్యలు తీర్చాలని కోరారు. రాప్తాడు నియోజకవర్గానికి పీఏబీఆర్ నుంచి ప్రతి ఏటా ఇచ్చే నీటా వాటాతో పాటు అవసరం మేరకు అదనంగా నీరివ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. హంద్రీనీవా ద్వారా గత ఐదేళ్లుగా నీరందక చెరువులు నిండకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. ఈ సారైనా రాప్తాడు నియోజకవర్గంలో వీలైనన్ని చెరువులను నీటితో నింపాలని ఆమె కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కాలువల నిర్వహణపై అధికారులు పరిశీలించేలా ఆదేశాలు జారీ చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఐఏబీ చైర్మన్, కలెక్టర్ వినోద్‌కుమార్‌కు విన్నవించారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 19: టీడీపీ ఈడిగ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మద్యం షాపుల్లో ఈడిగలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించిన నేపథ్యంలో గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు రాజు, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, గంగాధర్, శ్రీరాములు, జయప్రకాష్, చంద్ర, మధు, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

కూటమి వందరోజుల పాలనపై సంబరాలు


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆత్మకూరు నాయకులు

ఆత్మకూరు సెప్టెంబరు19: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనపై టీడీపీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ... గురువారం సీఎం చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ స్థానిక కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు శశాంక చౌదరి, కుళ్లాయప్ప, ప్రతాప్, మనోరంజన్, నాయకులు కందుల ఓబులపతి, సందీప్ చౌదరి, తిక్కస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు19: ఎన్నికల హామీల్లో భాగంగా మాజీ సైనికుల కోసం రూ.10 కోట్లు కార్పస్ విడుదల చేసి ఉద్యోగ కల్పన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న అన్నారు. ఆయన గురువారం ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావే శాన్ని నిర్వహించారు. యువగళం పాదయాత్రలో భాగంగా జిల్లా కొచ్చిన సమ యంలో మంత్రి నారా లోకేశ్‌కు మాజీ సైనికుల సమస్యలను విన్న వించామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వంద రోజుల్లోపే కేబినేట్ సమా వేశంలో రూ. 10 కోట్ల కార్పస్ ఫండ్ విడుదల చేయడం ఆనంద దాయకమన్నారు. ఈ విషంలో చొరవ చూపిన మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు మాజీ సైనికులకు రుణపడి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమయంలో సంఘం ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, సభ్యులు బీఏ హుస్సేన్, హుస్సేన్ బాష, ఖాజా సాబ్, ఇస్మాయిల్ షఫి, బాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ హర్షణీయం

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 19: వెనుకబడిన కులాలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజే నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో బీసీలకు ఇది సువర్ణ అధ్యాయమన్నారు. గతంలో స్థానిక సంస్థల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత నందమూరి తారకరామారావుకు దక్కుతుందన్నారు. దాన్ని 33 శాతానికి పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు.

'రీసర్వేలో భూములు మాయం'

శింగనమల, సెప్టెంబరు 19: గత వైసీపీ ప్రభుత్వం మండల వ్యాప్తంగా రీసర్వే చేపట్టిన తరువాత పలువురు రైతుల భూములు మాయం కావడంతో వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతు న్నారని ఎంపీటీసీ రఘునాథరెడ్డి రెవెన్యూ అధికారులను నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ యోగేశ్వరి అధ్యక్షతన ఎంపీడీఓ నిర్మలకుమారి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే కోరం కోసం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావలసిన సమావేశం 11.30కు ప్రారంభమైంది. అప్పటికీ... మండలంలో 13 మంది ఎంపీటీసీ సభ్యులు, 19 మంది సర్పంచ్‌లు, జడ్పీటీసీ ఉండగా కేవలం 10 మంది మాత్రమే హజరయ్యారు. అన్నిశాఖల అధికారులు హాజయ్యారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు మూడు నెలలకు ఒక సారి జరిగే సర్వ సభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు రాకపోకపోవడం ఏమిటనిని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా పలువురు సభ్యుల బదులు వారి బంధువులు సమావేశానికి వచ్చారు. నాయనవారిపల్లి సర్పంచ్ రమణమ్మ బదులు ఆమె తమ్ముడు రంగస్వామి సమావేశంలో కూర్చున్నా రు. అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలాకూమారి, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ , సీడీపీఓ ఉమాశంకరమ్మ, ఎంఈఓ నరసింహ రాజు, ఏఓ అన్వేష్‌కుమార్, ఇతర శాఖల అధికారులు, వైస్ ఎంపీపీలు విజయ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి అరకొరగా హాజరైన ప్రజా ప్రతినిధులు

శాంతిభద్రతల విషయంలో రాజీవద్దు

● రూరల్ డీఎస్పీకి ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 19: రాప్తాడు నియోజకవర్గంలో శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేయాలని రూరల్ నూతన డీఎస్పీ వెంకటేశ్వర్లుకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పరిటాల సునీతను మర్యాద పూర్వ కంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నేడు కనగానపల్లి మండలంలో ఎమ్మెల్యే పర్యటన

ధర్మవరంరూరల్(కనగానపల్లి), సెప్టెంబరు19: పలు అభివృద్ధి కార్యాక్రమాలను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే పరిటాల సునీత కనగానపల్లి మండలంలో శుక్రవారం పర్యటించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ముత్తవకుంట్ల, బాళేపాళ్యం, కనగానపల్లి, తగరకుంట, తూంచెర్ల, వేపకుంట, మద్దల చెరువు గ్రామాల్లో రూ. 3.60కోట్లు నిధులతో సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. కూటమి నాయకులు పాల్గొనాలని కోరారు.

రాహుల్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు: కాంగ్రెస్


గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 19: లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ, శివసేన నాయకులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు గురువారం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన స్థానిక క్లాక్‌టవర్ సమీపం లో ఉన్న మహాత్మగాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. బీజేపీ, దాని మిత్ర పక్షానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం అక్కడ నుంచి ఎస్పీ కార్యాల యం వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షులు దాదాగాంధీ, నాయకులు శివశంకర్ యాదవ్, రామ్‌చరణ్ యాదవ్, ఇమామ్, శర్మాస్, కొండారెడ్డి, హరి రాయల్, నిశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహాల వేళ వయసు నిర్ధారణ తప్పనిసరి : పీడీ

అనంతపురం విద్య, సెప్టెంబరు 19: గుళ్లు, చర్చి, మసీదులు వంటి ప్రార్థనా మందిరాల్లో వివాహాలు జరిగే సమయంలో వయస్సు నిర్ధారణ తప్పనిసరిగా చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. ఐసీడీఎస్ కార్యాలయ సమీపంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహలు నిరోధించడం, జీఓలు 31,39 మీద డివిజనల్ స్థాయి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ... వివాహాలు జరిగే సమయంలో... వధూవరుల వయస్సును కనుక్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ వెల్ఫేర్ ఆఫీర్ రామసుబ్బారెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి తదితరులు బాల్య వివాహాల నియంత్రణపై పాస్టర్లు, ఖాజీలు, అర్చకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ వనజాక్షి, డీసీపీఓ మంజునాథ్, చైల్డ్ లైన్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి, శిశుగృహ మేనేజర్ దీప్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పయ్యావులను కలిసిన ఎస్పీ జగదీష్


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 19 : రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను జిల్లా ఎస్పీ జగదీష్ మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక రాంనగర్‌లోని మంత్రి నివాసంలో గురువారం మంత్రిని ఎస్పీ కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

ఎమ్మెల్యే దగ్గుపాటిని కలిసిన కమిషనర్ నాగరాజు


ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందిస్తున్న నగర కమిషనర్ నాగరాజు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 19 : అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను అనంత నగర పాలక సంస్థ కమిషనర్ నాగరాజు గురువారం మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... నగరంలో ఎక్కడా పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై ప్రతి రోజు పర్యవేక్షించాలన్నారు. ఎలాంటి విమర్శలు, వివాదాలకు తావు లేకుండా పనిచేయాలని సూచించారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు రాజశేఖర్



అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19: జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడుకు చెందిన రాజశేఖర్ ఎంపికయ్యాడు. అతగు ఇటీవల అన్నవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో చాటిన ప్రతిభ ఆధారంగా జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఈనెల 25వతేదీ నుంచి హర్యాణాలో నిర్వహించే జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. రాజశేఖర్‌ను జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్ మొయిద్దీన్, వెంకటేశులు అభినందించారు.

హెచ్చెల్సీకి నీరు విడుదల చేయిస్తా: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల సెప్టెంబరు 19: నియోజకవర్గంలో సాగుకోసం హెచ్ఎల్‌సీకి నీటిని విడుదల చేయిచి రైతులకు దసరా పండుగ సంతోషాన్ని కలిగిస్తానని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఆమె గురువారం అనంతపురంలో జరిగిన ఐఏబీ సమావేశం తరువాత అమె విలేకరులతో మాట్లాడుతూ... శింగనమల నియోజకవర్గానికి ఈనెల 23వ తేదిన నీటిని విడుదల చేయునట్లు అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తామని 130 రోజులు నీటా సరఫరా ఉంటుదని తెలిపారు. గతంలో ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతి ఉండేదని, ఇప్పుడు అలాకాకుండా నేరుగా హెచ్ఎల్‌సీకి నీటి సరఫరా ఒకే విధంగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ పరిధిలో రెండు రోజులపాటు క్షేత్రస్థాయిలో పరిశీలించి 23 నుంచి హెచ్ఎల్‌సీపీ నీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు.

తైక్వాండో జిల్లా జట్టు ఎంపిక


ఎంపికైన ఎస్‌జీఎఫ్ తైక్వాండో జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19: ఎస్‌జీఎఫ్ తైక్వాండో జిల్లా స్థాయి క్రీడాకారులను ఎంపికచేశారు. ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ తైక్వాండో ఎంపిక పోటీలను గురువారం స్థానిక గుడ్‌చిల్డ్రన్స్ పాఠశాలలో నిర్వహించారు. డీఈఓ వరలక్ష్మి పోటీలను ప్రారంభించారు. విజేతలుగా దర్శన్‌తేజ్, యశ్వంత్, విక్రాంత్, శివ, వరుణ్ కుమార్ సాయి, అఫ్జల్ మెహరాజ్, జయసింహ, మీరాజాస్మిన్, నాగశ్వేత, ప్రవల్లిక, బి కావ్య, ఎస్ కావ్య, అక్షయ ఎంపికయ్యారు. వారు ఈనెల 22వ తేదీ నుంచి తిరుపతిలో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కార్యదర్శులు సుగుణమ్మ, మొరార్జీయాదవ్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు ప్రతాప్‌రెడ్డి, జయసింహ, రెడ్డప్ప, చామంతి తదితరులు పాల్గొన్నారు.

21, 29 తేదీల్లో ఫుట్‌బాల్, కరాటే సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలను ఈనెల 21న, కరాటే పోటీలన ఈనెల 29న హిందూపురంలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కార్యదర్శులు సుగుణమ్మ, మొరార్జీయాదవ్, అండర్-19 జిల్లా కారదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. అండర్-14, 17, 19 బాల, బాలికల క్యాటగిరిలలో ఎంపికపోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబర్లు 9440243423, 8919011628ను సంప్రదించాలని వారు తెలిపారు.

23న పారా స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19: రాయలసీమ స్థాయి పారా స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 23వ తేదీన స్థానిక ప్రసన్నాయ పల్లి రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న గిరీష్ స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యద ర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29వతేదీన విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబరు 8074106154ను సంప్రదించాలని కోరారు.

క్రీడాపోటీల్లో గురుకుల విద్యార్థుల సత్తా

గార్లదిన్నె, సెప్టెంబరు 19: ఏపీఆర్ మైనార్టీ గురు కుల పాఠశాల క్రీడా పోటీల్లో గార్లదిన్నె మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అనంతపురం నగరం లోని జూనియర్ కళశాల మైదానంలో గురువారం జరిగిన అండర్ -14, 17 కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీల్లో మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అంజినేయులు నాయక్ తెలిపారు. అం డర్-14, 17 కబడ్డీ పోటీల్లో విన్నర్స్‌గా, అండర్-14 వాలీబాల్‌లో రన్నర్స్‌గా నిలిచి ప్రతి కనబరిచారన్నారు. రన్నర్స్, విన్నర్స్‌గా విజయ సాధించి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఆ విద్యార్థులను ఆ పాఠశాల ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

డీఆర్‌ఎంతో రాయచూరు ఎమ్మెల్యే భేటీ



డీఆర్‌ఎంతో రాయచూరు ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్

గుంతకల్లు, సెప్టెంబరు 19: కర్ణాటకలోని రాయచూరు రైల్వేస్టేషన్‌లో సమస్యలు, ఇతర విషయాలు చర్చించేందుకు గాను అక్కడి ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ గుంతకల్లుకు వచ్చి డివిజనల్ రైల్వే మేనేజర్ విజయకుమార్‌తో భేటీ అయ్యారు. పట్టణంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో గురువారం ఉదయం ఆయన డీఆర్‌ఎంను కలిసి రైల్వే వసతులు, సమస్యల పరిష్కారాలపై చర్చించారు. రాయచూరు రైల్వే స్టేషన్‌లో ఉన్న లిఫ్టు చాలా చిన్నగా ఉందని, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎస్కలేటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఇంకా తదితర అంశాలపై విజ్ఞప్తులు చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కేశవ్ పర్యటన

బెళుగుప్ప, సెప్టెంబరు 19: మండలంలో శుక్రవారం రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ పర్యటించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ ప్రసాద్, నాయకులు పెద్దతిప్పయ్య, విరుపాపల్లి రాధాకృష్ణ, మల్లికార్జున, సర్పంచ్ రాము, వెంకటేశు తెలిపారు. మండలకేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. మంత్రి మండలంలోని రామసాగరం సమీపంలో బూదిగుమ్మ అంజనేయస్వామికి పూజలు చేసి ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు జనంబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని అన్నారు. కూటమి శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తొండపాడులో హుండీ లెక్కింపు

గుత్తిరూరల్, సెప్టెంబరు 19: మండలంలోని తొండపాడు గ్రామంలోని బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో గురువారం ఈఓ నాగేంద్రుడు ఆధ్వర్యంలో హుండీ కానుకల్ని లెక్కించారు. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.82,993 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రంగస్వామి రెడ్డి యాదవ్, ఈలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లు, సెప్టెంబరు 19: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో మూడు విడతల్లో నిర్వహించిన అడ్మిషన్లలో ఇంకా మిగిలిపోయిన సీట్లలో చేరడానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్ విద్యాసాగర్ గురువారం ప్రకటనలో తెలిపారు. ట్రేడ్‌ను బట్టి అర్హతలు కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్ సైట్ iti.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అప్లై చేసిన తర్వాత అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఐటీఐకి వచ్చి వాటిని వెరిఫై చేయించుకోవాలన్నారు. ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 19వ తేదీ గురువారం నుంచే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించామని పేర్కొన్నారు.

ఆలయాల భూములను ఆక్రమిస్తే చర్యలు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 19: మండలంలో దేవాలయాలకు చెందిన, దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న భూములను ఆక్రమించుకుంటే చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఈఓ బాబు హెచ్చరించారు. ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట, లింగదహాళ్, కొళగానహళ్లి గ్రామాలలో దేవాదాయ శాఖ అధీనంలో ఉన్న బళ్లారి రామస్వామి , అంజనేయ స్వామి, వీరభద్రస్వామి ఆలయాలకు చెందిన భూములను కొందరు ఆక్రమించుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో దేవాదాయశాఖ అధీనంలో ఉన్న భూములన్నీ గుర్తించి త్వరలో స్వాధీన పరచుకుంటామని ఈఓ తెలిపారు.

జాతీయ వీరశైవ కమిటీ సభ్యుడి ఎన్నిక

కణేకల్లు, సెప్టెంబరు 19: మండలానికి చెందిన టీడీపీ నాయకుడు వేలూరు మరియప్ప జాతీయ వీరశైవ లింగాయత్ కార్యనిర్వాహక సభ్యుడిగా ఎన్నికయ్యారు. బెంగుళూరులో గురువారం జాతీయ అధ్యక్షుడు శివశంకరప్ప ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మరియప్పను సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరశైవ లింగాయతుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

తాడిపత్రి, సెప్టెంబరు 19: మండలంలోని ఇగుదూరు గ్రామం వద్ద గురువారం పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి ట్రాక్టర్లను సీజ్ చేశామని, అలాగే ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని చెప్పారు.

ఘనంగా హిందీ దివస్

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 19: పట్టణంలోని శంకరానంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో గురువారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోపాల్ మాట్లాడుతూ వ్యక్తి సమగ్ర వికాసానికి భాష ఆయువు పట్టు అన్నారు. జాతీయ భాష హిందీపై ప్రతిఒక్కరూ పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌బాబు. అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మోసం చేశారని ఫిర్యాదు

కూడేరు, సెప్టెంబరు 19 : మండలంలోని కమ్మూరు గ్రామ సమీపంలో గల సైనికపురంలో మాజీ సైనిక ఉద్యోగులు గుత్తా రామాంజనేయులతోపాటు మరికొందరిని తోటి మాజీ ఉద్యోగులు మోసం చేశారు. ఈ మేరకు బాధితులు గురువారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసునమోదు చేశారు. సైనికపురంలో తమకు ప్లాట్లు కేటాయించారని, అయితే మాజీ సైనికఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శేఖన్న, సలహాదారుడు రంగారెడ్డి, తిమ్మారెడ్డి కలిసి కాంట్రాక్టర్ కిరణ్‌కుమార్‌తో కుమ్మకై తక్కువ ధరలకే ఇళ్లు నిర్మిస్తామని నమ్మించి, డబ్బులు కట్టించుకొని మోసం చేశారని ఫిర్యాదు చేశారు. మోసం వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, సెప్టెంబరు 19: ఎస్పీ జగదీశ్‌ను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఆయన ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.



ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

● స్వచ్ఛతాహిసేవ ర్యాలీలో కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్ విజయకృష్ణ భార్గవ్

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 19: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చునని మున్సిపల్ కమిషనర్ విజయకృష్ణ భార్గవ్ సూచించారు. పట్టణంలో గురువారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంపై కూటమి నాయకులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది కలసి పెద్దఎత్తున ర్యాలీ చేపట్టారు. ప్రధాన వీధుల్లో ర్యాలీ చేపట్టారు. తర్వాత టీ సర్కిల్‌లో మానవ హారంగా ఏర్పడి స్వచ్ఛతపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో పరిశుభ్ర మైన వాతావరణాన్ని పెంపొందించుకునేందుకు ప్రతి ఒక్కరు శాయశక్తులా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్లు, కౌన్సిలర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని నందలపాడులో ఉన్న కేజీబీవీలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, వైస్‌చైర్మన్లు సరస్వతి, అబ్దుల్‌రహీం హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అనంతరం పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అదేవిధంగా గాంధీసర్కిల్, యల్లనూరురోడ్డు సర్కిళ్లలో మానవహారంగా ఏర్పడి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ప్రతిజ్ఞ చేశారు. కౌన్సిలర్లు రేష్మాపర్వీన్, జింకా లక్ష్మిదేవి, అరుణ, విజయ్‌కుమార్, మల్లికార్జున, షెక్షావలి, సురేష్, రంగనాథరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, కాకర్ల రంగస్వామి, రాఘవేంద్ర, రాజేష్ రెడ్డి, మమత, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కుందుర్పి: మండల కేంద్రంలో జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాలలో సర్పంచ్ మారుతేశ్వరి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో విద్యార్థులకు స్వచ్ఛత గురించి, ప్లాస్టిక్ వాడకం ద్వారా జరిగే నష్టం గురించి సర్పంచ్ వివరించారు. తరువాత విద్యార్థులతో కలిసి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. కేజీబీవీలో స్వచ్ఛతాహి సేవ గురించి వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనరసింహ, ఎంఈవో తిప్పేస్వామి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, కేజీబీవీ ఎస్‌వో నిర్మల, ఇతర అధికారులు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో ర్యాలీ చేపట్టిన మున్సిపల్ కమిషనర్ కూటమి నాయకులు

బొమ్మనహాళ్: మండలకేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా శుభ్రత, పరిశుభ్రత నిర్వహించారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో శుభ్రత, పరిశుభ్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతాహి సేవలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈఓపీఆర్డీ దాస్, ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఫక్రుద్దీన్, టీడీపీ నాయకుడు పయ్యావుల అనిల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛత హి సేవ పై స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈవోఆర్డీ మోహన్‌రెడ్డి, పశువైద్యాధికారి రమేష్, వెలుగు ఏపీఎం ఆంజనేయులు తదితరులు అవగాహన కల్పించారు. స్వచ్ఛతతోనే ఆరోగ్యం నెలకొంటుందని అన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

గుత్తి, సెప్టెంబరు 19: గర్భిణులకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ డిల్లీశ్వరి సూచించారు. పట్టణంలోని పాత సీపీఐ కాలనీ, ఈద్గావీధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీడీపీఓ హాజరై మాట్లాడారు. గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. దీంతో రక్తహీనతను నివారించవచ్చన్నారు. తర్వాత పలువురు గర్భిణులకు సీమంతం చేశారు. సూపర్‌వైజర్ నాగేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త గౌసియా తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీఓ

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్ అంజనమ్మ హాజరై 15 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, రత్నమ్మ, మారక్క పాల్గొన్నారు.

వీధిదీపాల నిర్వహణలో వైఫల్యం

● కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం

● నిధులు వెచ్చించినా సమస్య ఎందుకు పరిష్కారం కాలేదని నిలదీత

రాయదుర్గంటౌన్, సెప్టెంబరు 19: వీధిదీపాల ఏర్పాటుకు వెచ్చిస్తున్న నిధులు గంగపాలు అవుతున్నాయి తప్ప సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని కౌన్సిలర్లు మున్సిపల్ అధికారుల తీరుపై మండిపడ్డారు. పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో గల కౌన్సిల్ సమావేశ భవనంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు పద్మజ, గోవిందరాజులు, అజయ్, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలో వీధిదీపాల సమస్యలు పరిష్కరించేందుకు కౌన్సిల్ సమావేశాల్లో పరిపాలన అనుమతులు తీసుకుని నిధులు వెచ్చిస్తున్నారే తప్పా.. సమస్య మాత్రం ఎక్కడా పరిష్కారం కాలేదన్నారు. వీధిదీపాల నిర్వహణలో మున్సిపల్ అధికారులు పూర్తిస్థాయిలో వైఫల్యం చెందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతివార్డులో విద్యుత్ దీపాల సమస్య ఉందని ధ్వజమెత్తారు. అలాగే పట్టణంలోని అన్ని వార్డుల్లోని కాలువల్లో పూడిక పేరుకుపోయిందని, దీంతో పారిశుధ్య సమస్య నెలకొంటోందని, వెంటనే పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. కౌన్సిలర్ ప్రశాంతి మాట్లాడుతూ మున్సిపాలిటీకు చెందిన భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో విద్యారణ్య జూనియర్ కళాశాలకు అద్దెకివ్వడం సరికాదన్నారు. జరగరానిది జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. సీఐ జయనాయక్ మాట్లాడుతూ పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వాసుపత్రి, వినాయక్ సర్కిల్, గాంధీ సర్కిల్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఉందన్నారు. పరిష్కరించేందుకు కౌన్సిలర్లు సహకరించాలని కోరారు. రోడ్డుకు ఉండే ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్య ప్రైవేటీకరణ కాకూడదు: ఏఐఎస్‌ఎఫ్

కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 19: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను ప్రైవేటీకరణ చేసేందుకు కంకణం కట్టుకున్నాయని, అలా ఎప్పటికీ కాకూడదని, అందు కోసం ఎందాకైనా పోరాడతామని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అన్నారు. పట్టణంలో గురువారం వారు జిల్లా మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి టీ సర్కిల్ వరకు వేలాదిమంది విద్యార్థులు ఏఐఎస్‌ఎఫ్ జెండా చేతపట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత మార్కెట్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి పాల్గొని మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం విద్యను పూర్తిగా ప్రైవేటీకరణ చేసే ధోరణిలో వ్యవహరిస్తుందన్నారు. ఇందుకు వ్యతిరేకంగా తాము అలుపెరగని పోరాటం చేస్తామన్నారు. నూతన విద్యావిధానం 2020ను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అంతకుముందు ఏఐఎస్‌ఎఫ్ పతాకాన్ని రాష్ట్ర మాజీ నాయకుడు నారాయణ స్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ నాయకులు గోపాల్, జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి, కోశాధికారి హనుమంతు, జిల్లా ఆఫీస్ బేరర్స్ సాయి స్వరూప తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న ఏఐఎస్‌ఎఫ్‌నాయకులు

పురాతన భవనాల పరిశీలన

ఉరవకొండ, సెప్టెంబరు 19: పట్టణంలోని పురాతన ప్రభుత్వ కార్యాలయా భవనాలను రాష్ట్ర ఆర్కిటెక్ అధికారి నవీన్ గురువారం తహసీల్దారు మహబూబ్‌బాషాతో కలిసి పరిశీలించారు. తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని పాత తహసీల్దార్, ట్రెజరీ కార్యాలయాలను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ వందేళ్ల క్రింత నిర్మించిన ఈ భవనాలు ఇప్పటికీ చెక్కుచెదరలేదన్నారు. చిన్నచిన్న మరమ్మతులు చేస్తే మరో వందేళ్లు ఉంటాయన్నారు. భవనాల నిర్మాణమంతా ఈ వాతావరణానికి అనుగుణంగా నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల పరిశీలన

బొమ్మనహాళ్, సెప్టెంబరు 19: మండలంలో పురాతన ఆలయాలను దేవాదాయశాఖ దేవాదాయశాఖ కర్నూలు అసిస్టెంట్ స్థపతి సుబ్రమణ్యం, అనంతపురం ఈఓ బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ హరిత, టెక్నికల్ అసిస్టెంట్ మహేంద్ర గురువారం పరిశీలించారు. దర్గాహొన్నూరు గ్రామంలో మల్లికార్జునస్వామి ఆలయం, సింగానహళ్లి గ్రామంలో వేదావతి హగరి నది ఒడ్డున వెలసిన సంగమేశ్వర స్వామి ఆలయం, ఉద్దేహాళ్ గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణం కోసం పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నవీన్, సల్లాపురం బాబు, మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బడేషావలి ఉరుసు

విడపనకల్లు, సెప్టెంబరు 19: మండలంలోని వీ కొత్తకోట గ్రామంలో శుక్రవారం నుంచి బడేషావలి ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ పెద్దలు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 20 వ తేదీన రాత్రి 10 గంటలకు స్థానిక ధాసనూరు లింగారెడ్డి తమ్ముడు చిన్నరామిరెడ్డి ఇంటి నుంచి గంధంను ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గాకు చేరుస్తామన్నారు. అలాగే 21వ తేదీ శనివారం ఉదయం బడేషావలి తాత సమాధిని ప్రత్యేక పూలతో అలంకరించి ఉరుసును నిర్వహిస్తామన్నారు. అదే రోజు భక్తులు చాదర్ ఊరేగింపు చేసి స్వామి వారి దర్గాను చేరుకుని మొక్కులు తీర్చుకుంటారన్నారు. 22వ తేదీన ఆదివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి స్వామి వారి షంషేర్‌ను ఘనంగా గ్రామ వీదుల్లో ఊరేగించి తిరిగి దర్గాను చేరుకోవటంతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమాన్ని గ్రామంలోని హిందు, ముస్లింలు కలిసి నిర్వహించటం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.

రేపు వైద్యశిబిరం

తాడిపత్రి, సెప్టెంబరు 19: పట్టణంలోని రోటరీక్లబ్ కార్యాలయంలో ఈనెల 21న మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల వరకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పీవీ సుబ్రహ్మణ్యం గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌లో మూర్ఛవ్యాధితో బాధపడుతున్న వారికి విజయవాడకు చెందిన డాక్టర్ శివన్నారాయణ వైద్యపరీక్షలు చేస్తారన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వందశాతం ఈ-క్రాప్ నమోదు

యల్లనూరు, సెప్టెంబరు 19: మండలంలో వందశాతం పంట నమోదు పూర్తయినట్లు ఏఓ రామకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. ఉద్యానవన పంటలతో పాటు మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, సోయా పంటలను కూడా ఈ క్రాప్ నమోదు చేసినట్లు తెలిపారు. సుమారు 7025మంది రైతులకు సంబంధించిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేయగా ఈ కేవైసీ 70శాతం పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన రైతులకు కూడా ఈనెల 23వ తేదీ లోగా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. ఈ కేవైసీ చేయించుకోని రైతులు రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లాలని ఆయన సూచించారు.

పంటలకు సోకే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 19: వేరుశనగ, ఆముదం, కంది పంటలకు సోకే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్ర ం శాస్త్రవేత్త శిరీష సూచించారు. మండలంలోని ఆవులదట్ల గ్రామంతో పాటు డీ.హీరేహాళ్ మండలంలోని మురిడి, కల్యం గ్రామాల్లో గల పంటలను గురువారం ఆమె పరిశీలించారు. పంటలకు పలు తెగుళ్ల సోకడాన్ని గుర్తించిన ఆమె వాటి నివారణకు రైతులకు పలు సూచనలు ఇచ్చారు. వేరుశనగలో ప్రస్తుతం ఉన్న బెట్ట ను అధిగమించడానికి లీటర్ నీటికి పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. కందిపంటకు వెర్రి తెగులు రాకుండా ముందస్తుగా ప్రోపర్గైట్ అనే మందును ఎకరానికి 400 మి.లీల చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఆముదం పంటలో తెల్లదోమ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అనంతపురం నుంచి సహాయ వ్యవసాయ సంచాలకుల శైలజకుమారి, వ్యవసాయాధికారి శంకర్‌లాల్‌నాయక్, ఏఈఓ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి మహేంద్ర, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారాన్ని చెల్లించాలి

డీ.హీరేహాళ్, సెప్టెంబరు 19: గత వైసీపీ ప్రభుత్వం 2023 ఖరీఫ్, రబీ సీజన్ల పంట నష్టపరిహారానికి సంబంధించిన జాబితాను తయారు చేసి ఆ పరిహారాన్ని రైతులకు అందించడం విస్మరించిందని, కూటమి ప్రభుత్వమైనా అందించాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలోని గ్రామ సచివాలయంలో రైతులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో 2023 ఖరీఫ్, రబీలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. సకాలంలో వర్షాలు రాక వేరుశనగ, పప్పుశనగ, మిరప, పత్తి, ఆముదం తదితర పంటలు పూర్తిగా నష్టపోయాయన్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతులు దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. 2023 ఖరీఫ్, రబీ ఇన్సూరెన్స్ ప్రకటించి రైతుల ఖాతాలకు జమ చేయాలని వారు కోరారు.

గుండెపోటుతో దళిత సంఘం నాయకుడి మృతి

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 19: ఎస్సీ, ఎస్టీ సమైక్య రాష్ట్ర నాయకుడు విరుపా శ్రీనివాసులు(39) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. అనంతపురానికి చెందిన విరుపా శ్రీనివాసులు వ్యక్తిగత పని నిమిత్తం గురువారం రాయదుర్గానికి వచ్చారు. మధ్యాహ్నం సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ చికిత్స అందించే లోపు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కూతురు ఉన్నట్లు సమాచారం.

అవగాహన సదస్సు

యాడికి, సెప్టెంబరు 19: మండలకేంద్రంలోని స్టార్ ప్యారడైజ్ హైస్కూల్లో విద్యార్థులకు గురువారం డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ రామచంద్ర కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కుష్ఠు సోకిన వారిలో చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, అరచేతులు, అరికాళ్లల్లో స్పర్శ లేకపోవడం, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, చేతివేళ్లు, కాలు వేళ్లు వంకర తిరిగి అంగవైకల్యం రావడం లాంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. బహుళ ఔషధ చికిత్స ద్వారా వ్యాధిని నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాంప్రసాద్‌గౌడ్, ఏఎన్‌ఎం మరియమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్, హత్య కేసులో సంచలన తీర్పు

● ముద్దాయిలకు జైలు శిక్ష ఖరారు

పామిడి, సెప్టెంబరు 19: వ్యక్తిని కిడ్నాప్ చేసి హత్య చేసిన కేసులో అనంతపురం 4వసెషన్స్ కోర్టు న్యాయాధికారి శోభారాణి గురువారం సంచలన తీర్పు ఇచ్చారు. అనంతపురం నగరంలోని నీరుగంటి వీధికి చెందిన విజయ్‌మోహన్, భాగ్యలక్ష్మి అక్కాతమ్ముడు. వీరు 2015 సెప్టెంబరు 12వ తేదీన సొంతపని నిమిత్తం పామిడికి వచ్చారు. కాగా వారిని బసిరెడ్డి రమేష్‌రెడ్డి, కే సూర్యనారాయణరెడ్డి, ఎల్ సుదర్శన్‌రెడ్డి, ఆర్ లక్ష్మి, ఎం నాగరాజు, ఎం చంద్రాయుడు, సీ హరినాథరెడ్డి, ప్యాపిలి మురళి కిడ్నాప్ చేసి బెదిరించి వారి అకౌంట్లలోని రూ. 47లక్షలు విత్ డ్రా చేయించారు. ఈ విషయం ఎక్కడా బయట పడకుండా ఉండేందుకు విజయ్‌మోహన్‌ను 2015 డిసెంబరు 25న గొంతు నులిమి చంపి జిల్లా కేంద్రం వద్ద గల నీటి కాలువలో పడేశారు. దీనిపై మృతుడి అక్క భాగ్యలక్ష్మి 2015 డిసెంబరు 31న పామిడి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి 4వ సెషన్స్ జడ్జి ఫర్ మహిళా ట్రైల్స్ కేసెస్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో న్యాయాధికారి శోభారాణి 13మంది సాక్షులను విచారించి నేరం రుజువు కావడంతో ఏ1 ముద్దాయికి జీవిత ఖైదుతో పాటు రూ.5వేల జరిమానా, మిగిలిన ముద్దాయిలకు ఏడేళ్ల జైలు శిక్ష తో పాటు ఒక్కొక్కరికి రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును పీపీగా సృజన ప్రాసిక్యూషన్ తరఫున వాదించినట్లు చెప్పారు.

డీఎస్పీగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 19: గుంతకల్లు సబ్ డివిజన్ డీఎస్పీగా ఆముదాల శ్రీనివాస్ గురువారం సాయంత్రం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ శివభాష్కర్‌రెడ్డిని అధికారులు బదిలీ చేసి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. నెల్లూరు జిల్లా కందుకూరు డీఎస్పీగా పనిచేస్తున్న ఆముదాల శ్రీనివాస్‌ను గుంతకల్లు సబ్ డివిజన్ డీఎస్పీగా బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీకి సీఐ లు, ఎస్ఐలు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



బాధ్యతలను స్వీకరించిన డీఎస్పీ

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రాజశేఖర్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19: జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పెద్దవడుగూరు మండలం కిష్టిపాడుకు చెందిన రాజశేఖర్ ఎంపికయ్యాడు. అతను ఇటీవల అన్నవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో చాటిన ప్రతిభ ఆధారంగా జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఈనెల 25వతేదీ నుంచి హర్యాణాలో నిర్వహించే జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున జిల్లాకు చెందిన రాజశేఖర్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. రాజశేఖర్‌ను జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్ మొయిద్దీన్, వెంకటేశులు గురువారం అభినందించారు.



పరిశ్రమల్లో ఉత్పాదకత సామర్థ్యం పెంచడమే లక్ష్యం

రాయదుర్గం, సెప్టెంబర్ 19: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో ఉత్పాదక సామర్థ్యం పెంచడానికి కేంద్ర ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వశాఖ లీన్ పథకాన్ని ప్రారంభించిందని జాతీయ ఉత్పాదక సంస్థ హైదరాబాద్ సెంటర్ డిపో డైరెక్టర్ సంజన్న తెలిపారు. పట్టణంలోని గార్మెంట్స్ ఓనర్స్ అసోషియేషన్ కార్యాలయంలో గురువారం అసోషియేషన్ అధ్యక్షుడు టంకశాల హనుమంతు అధ్యక్షతన గార్మెంట్స్ యజమానుల అవగాహన సదస్సు జరిగింది. ఇందులో సంజన్న పాల్గొని మాట్లాడారు. రాయదుర్గం పట్టణంలో తయారయ్యే జీన్స్ ఉత్పత్తుల్లో పెట్టుబడి వ్యయం తగ్గించడం, సరుకుల నాణ్యత పెంచడంపై గార్మెంట్స్ యజమానులకు పలు సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం 95 శాతం రాయితీతో ఉత్పాదకలో వేస్టేజ్ నివారించేందుకు కన్సలెంట్స్‌ని నియమించుకోవచ్చన్నారు. సమావేశంలో జిల్లా ఇండస్ట్రీస్ ఐపీఓ దుర్గేష్, విశాఖపట్టణం స్కిల్ డెవలప్‌మెంట్ చక్రవర్తి, అసోషియేషన్ సెక్రెటరీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో ఏడుగురి అరెస్టు

తాడిపత్రి, సెప్టెంబరు 19: మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో గత జూన్ 28వ తేదీన జరిగిన ఘర్షణలో కుమ్మరి సురేష్ పై దాడి జరిగింది. ఈ సంఘటనలో ఇదే గ్రామానికి చెందిన చౌడప్ప, నాగార్జున, శ్రీనివాసులు, రాజు, అశోక్, సురేంద్రతోపాటు మరొకరిని గురువారం అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. జూన్ 28న పింఛన్ల పంపిణీ సందర్భంగా గ్రామంలో కుమ్మరి సుబ్బయ్య, చౌడప్పల వర్గాలకు చెందిన ఇరువురు ఘర్షణకు దిగారు. ఇందులో సురేష్ గాయపడ్డాడు. అతడి ఫిర్యాదు మేరకు ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

వెంగన్నపల్లి గొడవలో ఏడుగురు..

యాడికి, సెప్టెంబరు 19: మండలంలోని వెంగన్నపల్లిలో ఈనెల 11న జరిగిన గొడవకు సంబంధించి గురువారం 7మంది టీడీపీ వర్గీయులను అరెస్ట్‌చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. ఈనెల 11న వెంగన్నపల్లి గ్రామంలో వైసీపీ నాయకుడు భాస్కర్ రెడ్డి ఇంటివద్దకు టీడీపీ వర్గీయులు వెళ్లి అతని కారు ధ్వంసంచేశారు. భాస్కర్‌రెడ్డి ఫిర్యాదుమేరకు అప్పట్లో టీడీపీ వర్గీయులపై కేసునమోదుచేశామని తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా గురువారం తిరునాథరెడ్డి, రంగస్వామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరాములు, వెంకటరెడ్డిలను అరెస్ట్‌చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పుట్లూరు, సెప్టెంబరు 19: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మండలంలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన వైజయంతి (28) అనే మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు. కడప జిల్లా వేముల మండలం గొందిపల్లి గ్రామానికి చెందిన వైజయంతికి చెర్లోపల్లికి చెందిన గోపాల్‌రెడ్డితో మూడేళ్లక్రితం వివాహమైంది. వరకట్నం తేవాలని భర్త, అత్త పార్వతి ఆమెను తరచూ వేధిస్తుండేవారు. వేధింపులు తాళలేక ఈనెల 8వతేన ఇంటిలో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందిందని, మృతురాలికి సంతానం లేదని, మృతురాలి తండ్రి వెంగళరెడ్డి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అన్నదమ్ముల ఘర్షణ

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 19: మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన రుద్రముని, ఆయన తమ్ముడు ఎర్రిస్వామి గురువారం భూ వివాదంపై ఘర్షణపడ్డారు. ఇందులో రుద్రమునిపై తమ్ముడు ఎర్రిస్వామి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కుటుంబసభ్యులు అతడిని రాయదుర్గం ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

యువకుడి అనుమానాస్పద మృతి

తాడిపత్రి, సెప్టెంబరు 19: పట్టణంలోని కృష్ణాపురం 1వ రోడ్డులో నివాసం ఉంటున్న యువకుడు మహబూబ్‌బాషా (20) గురువారం అనుమానాస్పదంగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఫరూక్, రజియాబేగం దంపతుల కుమారుడు మహబూబ్‌బాషా వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతుడి తండ్రి ఫరూక్ చాలా ఏళ్ల క్రితం కుటుంబాన్ని విడిచిపెట్టి ఎటో వెళ్లిపోయాడు. తల్లి రజియాబేగం అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబపోషణ మహబూబ్‌బాషాపై పడింది. అయితే అతను ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీవారి లడ్డూను అపవిత్రం చేయడం దుర్మార్గం

పుట్లూరు, సెప్టెంబరు 19: గత వైసీపీ హయంలో తిరుపతి వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వును కలిపి అపవిత్రం చేయడం దుర్మార్గమని, ఇది హిందువుల మనోభావాలను వైసీపీ అధినేత జగన్ దెబ్బతీయడమనేనని ఐ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొనుగుంట్ల విజయ్‌కుమార్‌నాయుడు గురువారం ప్రకటనలో మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో తిరుమలను అప్రతిష్ట పాలు చేశారన్నారు. తిరుమల ప్రసాదాన్ని భక్తులు ఎంతో భక్తితో స్వీకరిస్తారన్నారు. అలాంటి ప్రసాదంలో ఆవు నెయ్యికి బదులు జంతువుల కొవ్వును కలపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఢిల్లీలోని ప్రముఖ ల్యాబ్‌లో ఈ వ్యవహారం బయటపడడం అప్పటి వైసీపీ ప్రభుత్వానికి పరాకాష్టగా మారిందని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో తిరుమలను ప్రక్షాళన చేస్తామని ఆయన తెలిపారు.